

ఎంపీ వద్దిరాజు రవిచంద్రను సన్మానిస్తున్న బీఆర్ఎస్ గణపవరం మున్నూరు కాపు సంఘం నాయకులు

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కోదాడ రూరల్, మార్చి 9 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శనివారం మండల పరిధి ఎర్రవరం దుళ్లగుట్టపై వెలసిన బాల ఉగ్ర లక్ష్మీనారసింహస్వామిని ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో ముందుకు సాగిందని తెలిపారు. మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రజలను ఎలా మోసం చేస్తుందో అంతా గమనిస్తున్నారని, తగిన సమయంలో సరైన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం మండల పరిధి బీఆర్ఎస్ గణపవరం పార్టీ, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జాబిశెట్టి చంద్రమౌళి, మున్నురు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, బీఆర్ఎస్ నాయకులు ఆవుల రామారావు, పోశం పూర్ణయ్య, పోశం ఏడుకొండలు, కత్తి వెంకటేశ్వర్‌రావు, బొర్ర చంద్రమౌళి, పుప్పాల రంజిత, ఇప్పాల చంద్రశేఖర్, పాశం నరేశ్, శంకర్ శెట్టి గోపాల్‌రావు, చెన్నయ్య పాల్గొన్నారు.

రవన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీడీఎస్యూ, సీపీఐ(ఎంఎల్) నాయకులు

ఇండ్ల స్థలాల సాధన కోసం పోరాడుదాం

- పీడీఎస్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్

నేరేడుచర్ల, మార్చి 9 : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) స్ఫూర్తితో ఇండ్ల స్థలాల సాధన కోసం పారాడుదామని పీడీఎస్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య పిలుపునిచ్చారు. శనివారం రవన్న 8వ వర్ధంతిని నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం 48 సంవత్సరాలు అజ్ఞాత జీవితంలో అనేక పోరాటాలు నిర్వహించిన గొప్ప విప్లవ యోధుడు కామ్రేడ్ రవన్న అన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకుని సమస్యలపైనా పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కన్వీనర్ వాస పల్లయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకులు వాస కరుణాకర్, పీఓడబ్ల్యూ నియోజకవర్గ కన్వీనర్ నందా సత్తెమ్మ, మరియమ్మ, మాలాంబీ, శ్యామల, కావ్య, లావణ్య, బుచ్చమ్మ, అలివేలు, లక్ష్మి పాల్గొన్నారు.



టీఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాములుమాదిగ

జాతిని అమ్ముకునే వ్యక్తులను సహించేది లేదు

- టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా శ్రవణ్‌కుమార్ కొనసాగింపు
- టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు

బొడ్రాయిబజార్, మార్చి 9 : మాదిగ జాతి ప్రయోజనాల కోసం టీఎమ్మార్పీఎస్ పని చేస్తుందని వ్యక్తిగత ప్రయోజనాలు, స్వలాభాలకు తావు లేదని టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన టీఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం పేరుతో జాతిని అమ్ముకునే వ్యక్తులను తాము సహించబోమన్నారు. తాను ఏర్పాటు చేసిన సంఘంలో ఇటుకాల రాజు పని చేస్తున్నాడని ఆయన వేసిన కమిటీలకు టీఎమ్మార్పీఎస్‌కు సంబంధం లేదని తెలిపారు. కత్తి ఉపేందర్‌ను సంవత్సరం క్రితమే సంఘం నుంచి తొలగించామని జిల్లా అధ్యక్షుడిగా పుట్టల శ్రవణ్‌కుమార్ కొనసాగుతాడన్నారు. అనంతరం టీఎమ్మార్పీఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పంతం సతీశ్‌మాదిగ, పట్టణ యువజన అధ్యక్షుడిగా వల్దాస్ అభినాశ్‌మాదిగను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌కుమార్, టీఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి సైదులు, పట్టణ అధ్యక్షుడు పిడమర్తి మధు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొడ్డు సైదమ్మ, టీఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మీసాల శివరామకృష్ణ,

చివ్వెంల, ఆత్మకూర్.ఎస్ మండలాధ్యక్షులు యడవెల్లి రాము, బొల్లె అశోక్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్ : వైస్ ఎంపీపీని సన్మానిస్తున్న జడ్పీటీసీ సైదిరెడ్డి

మహిళా సాధికారతతోనే సమాజ పురోభివృద్ధి

– జడ్పీటీసీ సైదిరెడ్డి

హుజూర్‌నగర్ రూరల్ , మార్చి 9 : మహిళా సాధికారతతోనే సమాజ పురోభివృద్ధి జరుగుతుందని జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అమరవరంలో వైస్ ఎంపీపీ సైదమ్మ, కార్యదర్శి నిమ్మల కవిత, ఇతర సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ కామిశెట్టి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పట్టణంలోని ఎస్ఆర్‌కే అపార్ట్‌మెంట్‌లో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

హుజూర్‌నగర్, మార్చి 9 : అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, తెలంగాణలోనే హుజూర్‌నగర్ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టౌన్ హాల్ ఆధునీకరణకు రూ.కోటి మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో టౌన్ హాల్ కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచడం, కిచెన్ హాల్ నిర్మాణం, పార్కింగ్ కోసం సింగిల్ విండో స్థలాన్ని ఏర్పాటు చేసి పేద ప్రజలు పెళ్లిళ్లు చేసుకోవడానికి అందుబాటులోకి తెస్తామని తెలిపారు..క్రైస్తవుల స్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ.50 లక్షలు మంజూరు చేయించినట్లు చెప్పారు. అనంతరం రామస్వామి గుట్ట వద్ద ఇండ్లను కలెక్టర్ వెంకట్రావ్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న 2,160 ప్లాట్లు, డబుల్ బెడూం ఇండ్లను ఆధునీకరించేందుకు రూ.70 కోట్లు, లింగగిరి రోడ్డు నుంచి మఠంపల్లి జంక్షన్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.5.50 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. హుజూర్‌నగర్ మెయిన్ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రామాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఏరియా ఆస్పత్రిలో మ్యాన్ పవర్ పెంచడం, సీటీ స్కానింగ్ ఇతర నూతన పరికరాలు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. పట్టణంలో వేసవి తాగునీటి సమస్యలను అధిగమించేందుకు తక్షణమే రూ.కోటిన్నర నిధులు మంజూరు చేస్తామన్నారు. వట్టిపోయిన బోర్లను పునర్దురించాలని అధికారులను ఆదేశించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తక్కువ కాలంలోనే హుజూర్‌నగర్‌కు ఎక్కువ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వి. శ్రీనివాసులు, తాసీల్దార్ నాగార్జునరెడ్డి , మున్సిపల్ చైర్పర్సన్ గెల్లి అర్చనారవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నాగన్న, అజీజ్ పాషా, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, సుబ్బారాజు, సుబ్బారావు, గోపిరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయం ప్రారంభం

సూర్యాపేట రూరల్, మార్చి 9 : జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ, సువెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేధింపులు, హత్యాచారం, దాడులు, నిరాదారణకు గురైన బాధిత మహిళలకు, పిల్లలకు ఒకేచోట కేసు నమోదు చేయడంతో పాటు వైద్య, న్యాయ, మానసిక ధైర్యం, పిల్లలకు విద్యా వసతి, పునరావసం, కౌన్సిలింగ్ ఇవ్వడం, కోర్టుల విషయాలు ఇలా అన్ని సౌకర్యాలు కల్పించడం మంచి ఆలోచన అన్నారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, నాయకులు కొప్పుల వేణారెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్, కౌన్సిలర్ పద్మ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

కోదాడ : ముస్టి మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోదాడ పట్టణంలోని ముస్లింల షాదీఖానా, ఈద్గాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులపై స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి నిధులను సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. అంతకుముందు కోదాడ పట్టణంలో రూ.5 కోట్లతో నిర్మించనున్న కోదండ రామస్వామి ఆలయ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఆర్డీఓ సూర్యనారాయణ, కౌన్సిలర్ షేక్ మఫర్ పాల్గొన్నారు.

నిషేధిత మందులు అమ్మితే చర్యలు : జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్

మఠంపల్లి, మార్చి 9 : నిషేధిత మందులు అమ్మితే మెడికల్ దుకాణాలు, ఆర్ఎంపీ, పీఎంపీలపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ హెచ్చరించారు. కోదాడ ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్, తాసీల్దార్ మంగా రాథోడ్‌తో కలిసి శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం మండల కేంద్రంలోని దుర్గాభవాని మెడికల్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా నిషేధిత దగ్గు మందు 80 బాటిల్స్, 150 మత్తు ట్యాబ్లెట్లను పట్టుకున్నట్లు తెలిపారు. నిషేధిత మందులను సరఫరా చేసిన కోదాడ పట్టణంలోని శ్రీసాయి దుర్గా ఏజెన్సీ, శ్రీవెంకటసాయి మెడికల్ ఏజెన్సీపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. దుర్గా భవానీ మెడికల్ దుకాణాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్

జానల్‌దిన్నలో సీసీ కెమెరాలు ఏర్పాటు

నేరేడుచర్ల, మార్చి 9 : మండలంలోని జానల్‌దిన్న గ్రామంలోని ప్రజలు సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకుడు తక్కెళ్ల నాగార్జున మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, ఒక్క కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. కార్యక్రమంలో కుసుమ సోమిరెడ్డి, చాడ కృష్ణారెడ్డి, రాపోలు లక్ష్మీనారాయణ, పోలే వెంకటేశ్వర్లు, సుందరయ్య పాల్గొన్నారు.

జానల్‌దిన్న గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు తేజ విద్యార్థులు

ఫిట్ ఇండియా రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన తేజ విద్యాలయ విద్యార్థులు

కోదాడ రూరల్, మార్చి 9 : ఫిట్ ఇండియా రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు కోదాడ పట్టణ పరిధి కోమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రినిపాల్ రమా సోమిరెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ, భారత క్రీడాసాధికార సంస్థ అధ్వర్యంలో 2023లో నిర్వహించిన పోటీల ఫలితాలను వెల్లడించినట్లు తెలిపారు. విద్యార్థులు పల్లా హృతిక్, నవీన్‌కుమార్ ఏప్రిల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ రాణి

కోదాడ రూరల్, మార్చి9 : మండలంలోని కాపుగల్లు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ మల్లెల రాణి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం, మాజీ సర్పంచ్ తొండపు సతీశ్, తుమాటి వరప్రసాద్‌రెడ్డి, రేవూరి వెంకటాచారి, ఉన్నం హనుమంతరావు, కాసాని రామారావు పాల్గొన్నారు.

టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పీఆర్‌సీ హర్షనీయం

తిరుమలగిరి, మార్చి 9 : టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పీఆర్‌సీ ప్రకటించటం హర్షనీయమని టీఎస్ ఆర్టీసీ ఎప్లాయీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీఎస్ ఆర్టీసీకి పీఆర్‌సీ ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న 50 శాతం ఆర్‌పీఎస్ బాండ్స్ డబ్బులను కూడా ఇచ్చేందుకు అంగీకరించడం శుభ పరిణామం అని పేర్కొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టాలి

- ఎంపీపీ కళావతీసంజీవరెడ్డి

నూతనకల్, మార్చి 9 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లు ఏర్పడిన మూడు పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ భూరెడ్డి కళావతీసంజీవరెడ్డి, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతుల సాగునీరు కష్టాలను తీర్చడానికి కేసీఆర్ ప్రభుత్వం దూరదృష్టితో నిర్మించిన ప్రాజెక్టులో ఏర్పడిన చిన్న లోపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిచూపుతూ మరమ్మతులు చేపట్టకుండా రాజకీయం చేస్తున్నదన్నారు. వెంటనే మరమ్మతులు చేయించి రైతులకు నీరిచ్చి ఆదుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, నాయకులు బద్దం ప్రశాంత్ రెడ్డి, బత్తుల సాయిల్, బత్తుల విద్యాసాగర్, బత్తుల విజయ్, బత్తుల సురేశ్, వీరూయాదవ్, యాదగిరి పాల్గొన్నారు.

రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించాలి

- బీఆర్ఎస్ మండల నాయకుడు చిన వెంకన్న

చివ్వెంల, మార్చి 9 : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు నేరుగా రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు చిన వెంకన్న అన్నారు. శనివారం మండలంలోని బండమీదిచందుపట్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు ముందుగా గ్యాస్ నగదు మొత్తం చెల్లిస్తే ఆ తర్వాత బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్పడం సరైంది కాదని పేర్కొన్నారు.

గరిడేపల్లి : ముందు నగదు ఇచ్చి గ్యాస్ సిలిండర్ తీసుకుంటే తర్వాత బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తామనడం సబబు కాదని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇలానే చెప్పి గ్యాస్ తెచ్చుకున్న తర్వాత ఎప్పుడు వేసిందో దేవుడికే ఎరుక అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం బ్యాంక్‌లో జమ చేస్తామని చెప్పకుండా నేరుగా రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలన్నారు. అప్పుడే లబ్ధిదారులు నగదు కోసం ఎదురు చూసే బాధలు ఉండవని పేర్కొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి వర్తింపజేయాలి

- సీపీఐ మండల కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్

నూతనకల్, మార్చి 9 : అర్హులందరికీ గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే జీరో బిల్లులు ఇచ్చి మరి కొందరికి బిల్లులు ఇస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఆఫీసుల చుట్టు తిప్పుకోకుండా దరఖాస్తు చేసుకున్న వారందరికీ జీరో బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సైదులు, వీరన్న, పుల్లయ్య, నాగలింగం, అవిలయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : పిల్లలమర్రిలో శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో తలంబ్రాలు పోస్తున్న చైర్మన్ సైదులుగౌడ్ దంపతులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

నేరేడుచర్ల, మార్చి 9 : మహా శివరాత్రిని పురస్కరించుకుని నేరేడుచర్ల పట్టణం, మండలంలోని శివాలయాల్లో శనివారం వేకువజామున శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వేద మంత్రాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని సోమప్ప దేవాలయంలో నేరేడుచర్ల అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో, దిర్శించర్ల శివాలయంలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని మేళతాళాలు, వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి. సోమప్ప సోమేశ్వర దేవాలయానికి నల్లగొండ జిల్లా ఉట్లపల్లి గ్రామానికి చెందిన గజ్జి వెంకన్న, వెలమంచమ్మ దంపతులు కోడెదూడను ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణకు అందజేశారు.

కోదాడ రూరల్ : మండల పరిధి తొగర్రాయి గ్రామంలోని భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. యాదా శ్రీనివాస్‌రావు, మీనా, ఉపేందర్, సంగీత దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మునగాల : అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని మునగాల సహకార సంఘం చైర్మన్ కందిబండ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఇనుగుర్తి వీరచారి మాట్లాడుతూ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ముత్యాల సత్యనారాయణ, వ్యాపారవేత్త పోతుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : మహా శివరాత్రిని పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని పిల్లలమర్రిలో శివ పార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అనంతరం స్వామి వార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఎండ్లపల్లి మాజీ సర్పంచ్ దండి సుగుణమ్మ, ఎంపీటీసీ కుంట్ల సరిత, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చిలుకూరు : శివపార్వతుల కల్యాణం తర్వాత మండల వ్యాప్త గ్రామాల్లో స్వామి అమ్మవార్ల విగ్రహాలను వైభవంగా ఊరేగింపు చేశారు. ఆయా గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, మాజీ జడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్, ఎంపీటీసీ మండల శైలజామధు, మండవ మధు, బూర లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, నరసింహారావు, జానకీరాములు పాల్గొన్నారు.

నృసింహుడి నిత్య కళ్యాణం

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామి వారి నిత్య కల్యాణాన్ని అర్చకులు శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణ మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణతంతు జరిపించారు. అనంతరం గరుడ వాహనంపై ఆలయ పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

సర్వారం నల్లగుట్టపై వెలసిన శివయ్య

పానవట్టంపై అమర్చిన శివలింగం

గరిడేపల్లి, మార్చి 9 : మండలంలోని సర్వారం గ్రామ సమీపంలో గల నల్లగుట్టపై శివలింగం వెలుగు చూసింది. శివరాత్రి పర్వదినాన్నే బ్రహ్మసూత్రంతో కూడిన శివలింగం వెలుగు చూడడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. శివలింగం లభ్యమైన చోట శనివారం తవ్వగా శివలింగంను అమర్చే పానవట్టం లభ్యమైంది. సర్వారం గ్రామానికి చెందిన పగిడి దుర్గయ్య, కోటమ్మ కుమారుడు గోపి శివ భక్తుడు. మాంసాహారాలు మాని పన్నెండేండ్లుగా శివ పూజ చేస్తున్నాడు. ఇతడికి కొన్నేండ్లుగా శివుడు కలలో కనిపిస్తూ నల్లగుట్టపై వెలసినట్లు చెబుతున్నాడని వివరించాడు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులు, స్నేహితులకు తెలుపగా కొట్టిపారేసేనట్లుగా తెలిపాడు. మూడు నెలలుగా ప్రతి పండుగకు గుట్టపైకి వెళ్లి కొబ్బరి కాయలు కొట్టి వచ్చేవాడనని తెలిపాడు. శుక్రవారం శివరాత్రి సందర్భంగానూ నల్లగుట్ట వద్దకు వెళ్లి కొబ్బరి కాయ కొట్టి పుట్టలోకి చూడగా సూర్య కిరణాలు పడి శివలింగం బ్రహ్మసూత్రంతో కనిపించినట్లు వెల్లడించాడు. విషయం గ్రామస్తులకు తెలుపగా విషయం వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నాడు. గోపి ఇటీవల వెల్లడైన గురుకుల ఫలితాల్లో టీజీటీ ఉద్యోగం సాధించాడు.

మైనర్‌పై లైంగిక దాడి

నేరేడుచర్ల, మార్చి 9 : మైనర్‌పై లైంగిక దాడి జరిగిన ఘటన నేరేడుచర్ల పట్టణంలో శనివారం జరిగింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రులతో కలిసి ఉండే బాలిక (14), నిందితుడు సుభాని (45) నేరేడుచర్ల పట్టణంలోని ఓ వీధిలో పక్కపక్క ఇండ్లలో అద్దెకు ఉంటున్నారు. సుభాని కొన్నేండ్లుగా భార్యకు దూరంగా ఉంటూ వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. వారిరువురికి శుక్రవారం రాత్